ఉగాది కథలపోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

# ఆరోప్రాణం

మధ్యాహ్నం భోంచేసి నడుం వాల్చిన జగన్నాధాన్ని తెరలు తెరలుగా దగ్గు చుట్టుముట్టింది. రొప్పుతూ లేచి వంట ఇంట్లోకి వెళ్లాడు. గ్లాసుడు నీళ్లతో గొంతు తడుపుకుని మంచం దగ్గరకొస్తూ కొడుకు గదిలోకి తొంగి చూశాడు.

కంగారుగా పూర్ణచంద్రరావు రాస్తున్న కాగితాన్ని మడచి పుస్తకంలో దాచేశాడు.

కొడుకు తత్తరపాటును గమనించి "ఏవిట్రా చేస్తున్నావ్?" అని అడిగాడు జగన్నాధం.

"అబ్బే ఏం లేదు నాన్నా! నోట్సు రాసుకుంటున్నాను". నీళ్లు నమిలాడు పూర్ణచంద్రరావు.

అబ్బాయి తడబాటు చూస్తూ ఉంటే వాడేదో పొరపాటు చేస్తున్నట్లనిపించింది జగన్నాధానికి.

తండ్రి వెళ్లిపోగానే అదురుతున్న గుండెల్ని అదుపులోకి తెచ్చుకుంటూ పుస్తకంలో పెట్టిన కాగితాన్ని బయటకు తీశాడు పూర్ణచంద్రరావు.

ఆలోచనలు ముసురుకుంటున్నాయి జగన్నాధాన్ని. అబ్బాయి ప్రేమలో పడలేదు కదా! తనను చూడటంతోనే, రాస్తున్న కాగితాన్ని దాచవలసిన పనేముంది? అది కచ్చితంగా ప్రేమలేఖే అయి ఉండాలి. పట్టుమని ఇరవై ఏళ్లయినా నిండని పుత్రరత్నం ప్రేమ వ్యవహారంలో పడ్డాడేమో ననుకుందామన్నా నమ్మశక్యం కావడంలేదు.

కాస్సేపయ్యాక బాత్‌రూములో కెళ్లాడు పూర్ణచంద్రరావు.

జగన్నాధం ఉండబట్టలేక కొడుకు గదిలోకెళ్లి పుస్తకంలో నుండి కాగితాన్ని

తీసి ఆదుర్దాగా అక్షరాలలోకి దృష్టి సారించాడు.

అది ప్రేమ లేఖ కాదు. ఒక కళా ఖండం. చక్కటి సామాజిక ఇతివృత్తంతో సాగిన మహోన్నత రచన. శిల్పం అద్భుతం. అబ్బాయిలో అంతర్లీనంగా ఉన్న రచనా తృష్ణ ప్రతిబింబిస్తోంది. అతడు రాసిన కథను ఒకటికి రెండుమార్లు చదివి పుస్తకం దాచిపెడుతూ ఉండగా వచ్చాడు పూర్ణచంద్ర రావు.

కథ రాస్తున్నందుకు కన్న తండ్రి ఏమంటాడో నన్న బెదురు అతడి కళ్లల్లో ద్యోతకమౌతోంది.

"కాలేజి మేగజైన్‌కి రచన ఇమ్మంటే...." సంజాయిషీఇవ్వబోతున్న కొడుకును ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని "నీరచన చదివాను. ఎంతో బాగుంది. కృషి చేస్తే ప్రఖ్యాత రచయితవు కాగలుగుతావు. కథ రాస్తున్నందుకు నేనేమంటానోనని భయపడవలసిన పనిలేదు." అభయమిచ్చాడు జగన్నాథం.

"నాన్నా!"

పూర్ణచంద్రరావు నయనాల్లో ఆనంద జ్యోతులు వెలిగాయి.

"కథలు రాసి పత్రికలకు కూడా పంపు. నీ కృషికి నా సహకారం ఉంటుంది." ప్రోత్సహించాడు జగన్నాథం.

"సాహిత్యం మీద మీ కంత మక్కువ ఉందని తెలియక, మీ రేమంటారోనని భయపడ్డాను. చిన్నప్పుడు మీరు కథలు రాసేవారా?" ఆత్రంగా అడిగాడు పూర్ణచంద్రరావు.

"కథా రచన నా ఆరో ప్రాణం బాబూ! కొన్ని కథలు ఆనాటి ప్రముఖ వారపత్రికలలో అచ్చు అయ్యాయి."

"మరి మీరు రచనా వ్యాసాంగాన్ని కొనసాగించకపోవడానికి గల కారణం...." ఆదుర్దా వ్యక్తం చేశాడు పూర్ణచంద్రరావు.

కొడుకు ప్రశ్నకు అతడి మోములో నిర్లిప్తత చోటుచేసుకుంది. కళ్లు చెమ్మగిల్లాయి.

"ఇలా కూర్చో నాయనా! నువ్వడిగిన దానికి సమాధానం చెబుతాను."

తండ్రి చెప్పే మాటల్ని శ్రద్ధగా వినేందుకు ఉద్యుక్తుడయ్యాడు పూర్ణచంద్రరావు.

● ● ●

జగన్నాథానికి చిన్నప్పటి నుండి రచనలు చేయాలన్న తపన బాగా ఉండేది. కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే కథా రచనకు శ్రీకారం చుట్టాడు.

కొడుకు కథలు రాస్తున్నాడని తెలుసుకున్న కోదండరామయ్య జగన్నాథం మీద కారాలు మిరియాలు నూరాడు. "రచనా వ్యాసాంగం మన ఇంటా వంటా లేదు. కథలూ, కాకరకాయలూ కడుపు నింపవు. శ్రద్ధగా చదూకుని వృద్ధిలోకి రావడానికి ప్రయత్నించు." అంటూ మెత్తగా మందలించాడు.

ఆదిలోనే అపశ్రుతి పలకడంతో మౌనంగా రోదించింది అతడి మనసు. తీరిక దొరికి నప్పుడెల్లా గ్రంధాలయానికి వెళ్లి నవలలు, వారపత్రికలు చదివేవాడు. ఒక్కోమారు తను కూడా ప్రసిద్ధ కథా రచయిత అవాలని కలలు గనేవాడు. ఏ కళకైనా పట్టుదల, అన్యుల ప్రోత్సాహం అవసరం. తనకు పట్టుదల ఉంది. ప్రోత్సాహమే కరువైంది.

బి.ఏ. పాసైన జగన్నాథం ఉద్యోగాన్వేషణలో పడ్డాడు. దినమంతా ఖాళీగా ఉండటంతో రచనలు చెయ్యాలన్న కోరిక జనించింది. తల్లిదండ్రులు కోప్పడతారేమోనని దొంగతనంగా కథలు వ్రాయడం ప్రారంభించాడు. కొన్ని ప్రచురణకు స్వీకరించబడ్డాయి. మరికొన్ని ప్రతులు పత్రికా కార్యాలయాల నుండి తిరిగొచ్చేవి. కొడుకు కథలు రాస్తున్నాడని తెలిసి మరో మారు మండిపడ్డాడు కోదండరామయ్య.

ఇంట్లో మళ్లీ ప్రతిఘటన ఎదురవడంతో తన కలానికి పని కల్పించడం తాత్కాలికంగా మానుకున్నాడు జగన్నాథం. డిగ్రీ పూర్తి చేసి ఆరేళ్లయినా ఉద్యోగం దొరకలేదు జగన్నాథానికి. తిని కూర్చోలేక సినిమా థియేటర్‌లో టిక్కట్లమ్ముతూ, హోల్‌సేల్ దుకాణాలలో.అకౌంట్లు రాస్తూ అంతో ఇంతో సంపాదించడం మొదలు పెట్టాడు.

నిద్రలేమి వల్లో, పోషకాహారం తీసుకోకపోవడం వల్లో తలనొప్పికి గురయ్యాడు జగన్నాథం.

డాక్టరు కళ్లు పరీక్షించి అద్దాలు రాశాడు.

"మూడు పదులు నిండకుండానే అద్దాలేమిటి? రాత్రింబవళ్లూ కథలు వ్రాయడం వల్లే వాడికా తలనొప్పి" అంటూ ఆగ్రహం వెలిబుచ్చాడు కోదండరామయ్య.

ఇంట్లో తనెప్పుడు కాగితాన్ని నలుపుచేద్దామన్నా ప్రతిఘటనే ఎదురవుతోంది. స్వేచ్ఛలభిస్తే తప్ప కోరిక తీరదనుకున్నాడు జగన్నాథం.

"నాన్న గారి మాట విని కథలు రాయడం మానేయరా. నీ ఆరోగ్యం బాగుంటుంది. కథలు మనకు అచ్చిరావు" కొడుకును బ్రతిమలాడింది కమలమ్మ.

అర్థంలేని అమ్మ మూఢ విశ్వాసం తన బలీయమైన కోరికను సమాధి చేసింది.

కొన్నాళ్లు కథల జోలికి పోలేదు జగన్నాథం.

అనుకోకుండా సంబంధం కుదరడంతో పెళ్లయిపోయింది సగన్నాథానికి. కళ్యాణిని కట్టుకున్న తొలి రోజుల్లో ఆమె తన ప్రయత్నానికి ప్రోత్సాహమిస్తుందని ఆశపడ్డాడు.

రాత్రులు అంతా నిదురించే సమయంలో గదిలో లైటు వేసుకుని రచనలు చేయడం ప్రారంభించాడు. వైవిధ్యం గల రచనలు చేసి పాఠకుల ప్రశంసలను పొందాలన్న తపన తప్ప ఆస్తులు సంపాదించలన్న ఆశలేదతడికి.

అర్థ రాత్రి మూత్ర విసర్జనకు లేచిన కోదండరామయ్య కొడుకు గదిలో లైటు వెలుగుతూ ఉండటం చూసి, మళ్లీ కథలు రాస్తున్నాడని గ్రహించి మరో మారు మండిపడ్డాడు. దాంతో జగన్నాథం కలానికి ఇంకోసారి బ్రేకు పడింది.

ఉన్నట్లుండి గుండెపోటుకు గురయ్యాడు కోదండరామయ్య.

జగన్నాథం పరుగెత్తుకుని డాక్టర్ని లాక్కొచ్చి వైద్యం చేయించాడు.

గండమైతే తప్పింది గాని మంచం దిగలేదు కోదండరామయ్య.

"మనకు కథలు అచ్చిరావని మొదటి నుండీ నెత్తి మొత్తుకుంటున్నా నామాట పెడచెవిని పెడుతున్నావ్! జబ్బుతో మంచానికి అంటుకుపోయిన మీ నాన్న ఆరోగ్యం నీ చేతుల్లో ఉంది. నా సౌభాగ్యాన్ని కాపాడి పుణ్యం గట్టుకో." జగన్నాథం చేతులు పట్టుకుని ప్రాధేయపడింది కమలమ్మ.

"ఏమిటమ్మా ఈ మాటలు?... నేను కలానికి ఏనాడో స్వస్తి చెప్పాను. ఇంకెప్పుడూ కథలు రాయనని వాగ్దానం చేస్తున్నాను" అన్నాడు తల్లి ఆవేదనాగ్నికి కరిగిపోయిన జగన్నాథం.

తల్లిదండ్రుల ఆలోచనా సరళికి, వాళ్ల మూఢనమ్మకాలకు విస్తుపోయాడు. తను కథలు రాయడానికీ, ఇంట్లో జరుగుతున్న పరిణామాలకూ సంబందమేమిటో ఎంత ఆలోంచినా అతడికి అవగత మవడంలేదు. కాలం తండ్రిని కబళించడంతో బావురుమన్నారంతా.

భర్తపోయిన దుఃఖంలో దిక్కు తోచక దిగులుతో మంచం పట్టింది కమలమ్మ రెపరెప లాడే తల్లి ప్రాణం పంచభూతాల్లో కలిసిపోవడానికి ఎంతో కాలం పట్టలేదు. గాఢాంధకారంలో చిరుదివ్వెలా ఆ ఏడే జగన్నాథానికి కొడుకు పుట్టాడు.

తల్లిదండ్రులు కాలం చేయడంతో జగన్నాథానికి స్వేచ్ఛ లభించింది. తనిప్పుడేం చేసినా అడ్డు చెప్పే వారు లేరనుకున్నాడు. అంతవరకు నిద్రాణమై ఉన్న రచనా తృష్ణ తలెత్తింది. ధైర్యంగా కలం అందుకున్నాడు జగన్నాథం.

"మీ రచనల మూలంగా మనింట్లో ఎన్ని తుఫాన్లు చెలరేగాయో, అవి ఎందర్ని ఎలా మట్టుపెట్టేశాయో కళ్లతో చూస్తూనే మళ్లీ కలం పట్టుకోడానికి మీ కెలా మనస్సంగీకరించిందండీ?" అంది కళ్యాణి.

భార్య గొంతులో ఆర్ద్రత ఇమిడి ఉంది.

అర్ధాంగిని ఆరాధనగా చూశాడు.

ఆమె అమాయకపు చూపుల్లో దైన్యం ఉట్టిపడుతోంది. అత్త మామల మూఢనమ్మకాలు ఇల్లాలికి కూడ ఒంటపట్టినట్లున్నాయనుకున్నాడు. కళ్యాణి మనసును కలవర పరచడ మిష్టంలేక తీసిన కలాన్ని మూసేశాడు.

రోజులు దొర్లుతున్నాయి.

వసంతాలు తిరుగుతున్నాయి.

కాకతాళీయంగా ప్రముఖ వారపత్రికలోని దీపావళికి కథల పోటీ ప్రకటన చూశాడు జగన్నాథం. మళ్లీ కథ రాయమని వెన్ను తట్టిందతడి అంతరాత్మ. బహుశా. రచనా వ్యాసాంగం కూడా ఓ విధమైన వ్యసనమేమో అనిపించిందా క్షణం.

వెంటనే పుస్తకాల షాపు కెళ్లి కాగితాలు కొనుక్కొచ్చాడు. భార్య ముందు కలం తెరవడానికి మనస్కరించక కథ రాయాలన్న ప్రయత్నాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నాడు.

ఆ రాత్రి జగన్నాథం పడుకున్నాడన్న మాటేగాని నిద్ర పట్టడం లేదు.

భార్య వంక చూశాడు. అలవోకగా.

అప్పటికే ఆమె నిద్రా దేవి ఒడిలో ఒరిగిపోయింది.

కథ రాయడానికి ఇంతకంటే మంచి తరుణం లభించడం దుర్లభమనుకున్నాడు. లైటు వేస్తే కళ్యాణికి మెలుకువ రావచ్చు. అందుకని వీధి తలుపు, తెరచుకుని డాబా ఎక్కాడు.

డాబా మీద వీధి దీపం కాంతి సూర్య కాంతిలా పరచుకుంది.

ముందుగా ఊహించుకున్న ఇతివృత్తానికి చకచకా అక్షర రూపమిచ్చాడు.

రెండు గంటలలో చిత్తు ప్రతి పూర్తి చేసి గుండెలనిండా గాలి పీల్చుకున్నాడు. అనిర్వచనీయమైన ఆనందం అతడిలో చోటుచేసుకుంది. యుద్ధ భూమిలో

విజయం సాధించిన సిపాయిలా సంబరపడిపోయాడు. చేతి గడియారం మూడవుతున్నట్లు చెబుతోంది. మరునాడు రాత్రి దానిని ఫెయిర్ చేద్దామని కాగితాలు మడుస్తూ ఉండగా భార్య కేకలు వినిపించాయి. పరిస్థితి అర్థం గాక హడావిడిగా మెట్లు దిగి ఇంట్లోకి వెళ్లాడు.

గదిలో వస్తువులన్నీ చెల్లా చెదురుగా పడున్నాయ్ "మీరా దిక్కుమాలిన కథలు రాసుకోడానికి తలుపులు తెరచుకుని డాబా మీదకి వెళ్లిపోయారు. ఇదే మంచి అదను అనుకుని దొంగ ప్రవేశించి నా మెడలో గొలుసు, విలువైన వస్తువుల్ని దోచుకుపోయాడు. నేను బ్రతికి ఉన్నంత కాలం మీరు కలం ముట్టుకోనని మాటివ్వండి. లేకుంటే మీ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటాను" అంటూ భోరున ఏడ్చింది కళ్యాణి.

పరిస్థితిని ఆకళింపు చేసుకున్న జగన్నాథం మాటలు రాని ప్రతిమ అయిపోయాడు. ఆ షాకు నుండి తేరుకోవడానికి చాలా సేపు పట్టింది.

"కళ్యాణీ! నా కలంలో ఏదో దోషం ఉందేమో ననిపిస్తోంది. లేకపోతే నేను కలం తీసినప్పుడల్లా ఏదో ఒక ఉపద్రవం ముంచుకు రావడమేమిటి? ఇహ ఈ జన్మలో కథలు రాయనని నీ మీదే కాదు ఆ భగవంతుడి మీద కూడా ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు జగన్నాథం భార్య చేతిలో చేయివేస్తూ.

❁ ❁ ❁

కన్న తండ్రి కథ విన్న పూర్ణచంద్రరావు కళ్లు నీటి కుండలయ్యాయి. హఠాత్తుగా లేచి బైటకు వెళ్లిపోయాడు.

ఏ మాటా చెప్పకుండా కొడుకు అంత హడావిడిగా ఎక్కడికి వెళ్లాడో జగన్నాథానికి అర్థం కాలేదు.

అరగంట తరువాత వార పత్రికలు, తెల్లకాగితాలతో తిరిగొచ్చిన కొడుకును చూసి ఆశ్చర్యపోయాడు.

"ఇప్పుడు రాయండి నాన్నా! మీ అనుభవాల్ని, మనోభావాల్ని కళ్లకు కట్టేటట్లు రాయండి. నేను మీకు అండగా ఉంటాను."

పూర్ణచంద్రరావు మాటలలో ఆవేదన ఉంది.

ఆరాటం అంచులు దాటింది.

"వద్దు బాబూ! నేను జన్మలో కలం తాకనని పోయిన మీ అమ్మ మీద

ప్రమాణం చేశాను. నాకు లభించని ప్రోత్సాహం నీ కెల్లప్పుడూ ఉంటుంది. నా వేదననీ, ఆవేదననీ ఆరాధనగా మలచుకుని రచనలు చేసి నువ్వో మహారచయితవైతే నాకదే చాలు! భావిలో నీకు లభించబోయే పురస్కారాల్ని నా కళ్లతో వీక్షించే భాగ్యాన్ని, సౌభాగ్యాన్ని కలుగజేయి! ఆనాడు నేను ఓ మహా రచయిత నైనంత ఆనందాన్ని అనుభవిస్తాను" అంటూ కళ్లు ఒత్తుకున్నాడు జగన్నాథం.

● *ఆంధ్రప్రభ వీక్లీ, 6–10–93 1991* ●